'కథానిక'

# ప్రపంచం

—వి. కె. విశ్వనాథ శర్మ

తద్దినం భోజనంచేసి, భుక్తాయాసం తీర్చుకునేందుకు మంచంమీద నడుం వాల్చిన బ్రాహ్మడిలా ప్లాట్ ఫారంమీద ఆగింది రైలు.

ఇంటిబెల్లు కొట్టగానే క్లాసు లోంచి బైటికి వురికే బడిపిల్లల్లా బిలబిల మంటూ బండి దిగుతున్నారు ప్రజలు.

"కాఫీ! కాఫీ"

"ఇడ్లీ ....వడ —కాఫేయ్!"

"నాన్ రొట్టె, వెన్న, బిస్కెట్టోయ్"

బెల్లం చుట్టూ చేరే ఈగల్లా గుయ్.. మంటూ కంపార్టుమెంట్సును చుట్టుముట్టారు వి. ఆర్. ఆర్. వ్యాపారస్థులు.

"కూలీ అయ్యగారూ!"

"కూలీ అమ్మా"

ఎగబడుతున్నారు పోర్టర్లు.

అయిర్ బ్యాగు భుజాన తగిలించుకుని నేనూ దిగాన- మూడు రోజులు ప్రయాణించి— బొగ్గుగని కార్మికుడి లాంటి అవతారంతో.

జీవితంలో మొదటిసారి ఇంత ప్రయాణం.... అప్పుడే అయిందా? ఇప్పుడిక్కణ్ణించి ఇంకో ట్రయిను మారాలి. ఇంకో గంటకిగానీ ఆ బండిరాదు. మరో నాలుగు గంటలకుగానీ ఇంటి మొహం (చూడను. [illegible])

టీస్టాలు దగ్గరకెళ్ళి నీళ్ళ కాఫీతో నోరు తడుపుకునివచ్చి బెంచీమీద చతికిల బడ్డాను.

ఎక్కడి వాళ్ళక్కడ మాయమై పోయారు- బండి దిగిన వాళ్ళంతా.

ఓ చిన్న లెదర్ సూట్ కేస్, రెండు చేతి సంచులు బెంచీమీద ప్రక్కన పెట్టుకు కూర్చున్నాడు. నా ప్రక్కన ఒకగ్లాస్కో బట్టల పెద్దమనిషి.

అనుమానంగా అతను నన్నూ నా అవతారాన్ని పట్టి పట్టీ చూస్తున్నట్టు అనిపించింది.

కాసేపటి తర్వాత సూట్ కేసును, సంచుల్ని ఒళ్ళో పెట్టుకుని, ఏడ్చేపిల్లను కావిలించుకు ఓదార్చే తల్లిలా రెండు చేతుల్నీ వాటిచుట్టూ బిగించాడు.

చటుక్కున తల తిప్పాను నేను.

నేనే తలతిప్పుకుని జేబులోంచి సిగరెట్టు పెట్టె తీసాను. ప్రయాణ బడలిక. ఒళ్ళంతా విరగ్గొట్టి నట్టువుంది. కోతలయిన తర్వాత వుండే పొలంలా వుంది గెడ్డం. ఆవిలిస్తూ ఒళ్ళు విరుచుకొని, గెడ్డం గోక్కున్నాను. ఒకటే చికాకు. సిగరెట్టు ముట్టించి వెనక్కి జారగిలబడ్డాను.

నా ప్రక్క 'గ్లాస్కో' మనిషి నన్ను పిచ్చివాడు చూసినట్టు చూస్తూనేవున్నాడు.




"ఎందాకా మాస్టారూ?" నేనే పలకరిస్తూ అడిగాను.

గార్డు విజిలు వేశాడు.

ఒక నిముషంలో ప్లాట్‌ఫారం దాటిపోయింది రైలు. అటే చూస్తూవున్నాను. చేతికేదో తగిలింది. ప్రక్కకు తిరిగాను.

'గ్లాస్కో' మనిషికి, నాకూ మధ్య ఒక 'టెరీకాట్' బట్టల మనిషి కూలింగ్ గ్లాసులు తీస్తూ కూర్చున్నాడు.

నేను కొంచెం ఇవతలికి జరిగి కూర్చున్నాను.

'టెరీకాట్' మనిషి దగ్గర చిన్న బ్రీఫ్‌కేసు వుంది. మనిషి మాంచి 'పర్సనాలిటీ'గా వున్నాడు.

"ఎక్కడి కెళ్తున్నారూ?" కాలుమీద కాలేసుకుంటూ అడిగాడు- గ్లాస్కో మనిషిని.

నేను కొంచెం ముందుకివంగి గ్లాస్కో మనిషిని జూసాను – చూసీచూడనట్లు.

ఇంతకు ముందు నన్ను చూసినట్టు చూడటం లేదతన్ని.

తోకాడిస్తూ బిస్కట్లు తింటున్న ఆల్సేషన్ డాగ్‌ను చూసే ఆఫీసరులా చూస్తున్నాడు.

"విజయవాడ" నవ్వుతూ చెప్పాడు.

ఇంతలో నా బండి ఇంకా కొద్ది నిముషాల్లో రాబోతోందని లౌడ్ స్పీకరులోంచి ఎనౌన్సుమెంటు వినబడింది.

హమ్మయ్య! బండి ముందుగానే వస్తోంది.

సిగరెట్టు అవతల పారేసి బ్యాగ్ లోంచి 'చలం ఆలోచనలు' పుస్తకం తీసి చూస్తున్నాను.

చదువుతున్నానేగానీ కళ్ళు చూస్తు

న్నది మెదడు చూడలేక పోతోంది. కారణం నాపక్క-ఇద్దరూ మాంచిజోరుగా మాట్లాడుకుంటున్నారు.

నేను పుస్తకం మూసేశాను.

"ఒక్క నిముషం నా లగేజి చూస్తుంటారా? బుకింగ్ వరకూ వెళ్ళొస్తాను" గ్లాస్కో మనిషి అడుగుతున్నాడు.

"ఆఁ.... ఓ.కె. వెళ్ళిరండి. వెళ్ళిరండి" తల ఆడిస్తూ అన్నాడు టెరీకాట్ మనిషి.

నేను లేచి బండి రాబోయే దిక్కుగా చూశాను. సిగ్నలిచ్చి వుంది.

ప్లాట్‌ఫారం మీద మళ్ళీ కోలాహలం- కోడిపందాల పర్రలోలాగ.

బండి రావటమే క్రిక్కిరిసి వస్తుంది. కొంచెం ముందుకి వెళ్ళకపోతే లాభం లేదు.

ప్లాట్‌ఫారం ముందుకి నడిచాను.

"కూ.... అని కూతవేస్తూ, ముసలి గేదె కాళ్ళు కొట్టుకుంటూ నడిచి వచ్చినట్లు శబ్దం చేసుకుంటూ వచ్చి ఆగింది బండి.




ఇసుకవేస్తే రాలేంత ఖాళీ వుంది గానీ వేసేందుకు ఖాళీలేదు ముందు. కంపార్టుమెంట్లన్నీ అలానే వున్నాయి.

హడావిడి పడుతూ వెనక్కి రాక తప్పలేదు.

ఎక్కేందుకు ఖాళీగా వున్న పెట్టెలో అడుగు పెట్టగలాను.

బైట నానాగొడవగా వుంది.

"నా పెట్టె! నా పెట్టె:" ఆ అరుపులు, పెడబొబ్బలు విని వెనక్కి తిరిగాను.

గ్లాస్కో పెద్దమనిషి ఒళ్ళు కాలినవాడిలా కొట్టుకుంటూ, పిచ్చివాడిలా అరుస్తున్నాడు, చుట్టూ జనం.

"ఎక్కడ పెట్టారూ?"

"ఎవరికన్నా చెప్పారా?"

"పోలీసు రిపోర్టివ్వండి"

ఎవరి ఉచిత సలహాలు వాళ్ళిస్తున్నారు. 'ప్చ్' అని పెదవి విరుస్తున్నారు, 'టెరీకాట్' మనిషి మాత్రం ఆ జనంలో ఎంత వెదికి చూసినా నా కంటికి కనపళ్ళేదు.

ఇంతలో గార్డు విజిలు వినబడింది. కొంచెం తొంగిచూశాను.

"ఇక పద! పద!" అంటున్నట్టు వూగుతున్న పచ్చజెండాకి కాస్త దూరంగా ఫెన్సింగ్ అవతల చేతిలో గ్లాస్కో పెద్దమనిషి తాలుకూ పెట్టెతో సహా టెరిలిన్ సూట్‌వాడు ఓపెన్ టాప్ రిక్షాలో కనబడ్డాడు! కాని నేనేమీ పైకి అనలేదు.